సాక్షి
నాగర్‌కర్నూల్

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



ఒక్కో మెట్టెక్కి విజయతీరాలకు

ఉమ్మడి జిల్లాలోని పలువురు నిరుద్యోగులు గ్రూప్‌–1లో సత్తాచాటి ఉన్నత ఉద్యోగాలకు ఎంపికై తల్లిదండ్రుల కలను నెరవేర్చారు.

-10లో ▸



కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- కలెక్టర్ బదావత్ సంతోష్
- కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

నాగర్‌కర్నూల్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులు, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళా ఉద్యోగులు, ఇతర మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రకృతిని, మహిళా శక్తిని గౌరవిస్తుందన్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే పండుగ భక్తిశ్రద్ధలతో పాటు సామూహిక ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మలో ఉపయోగించే గూనుగు పూలు, తంగెడు, బంతి, గులాబీ, తులసి వంటి పువ్వులు మహిళల భక్తిని మాత్రమే కాదని.. ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని కూడా గుర్తుచేస్తాయని అన్నారు. ప్రతి మహిళ బతుకమ్మ సంబరాలను ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ నెల 30న జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలను స్థానిక మినీ ట్యాంక్‌బండ్‌పై అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని.. జిల్లాలోని మహిళలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పి.అమరేందర్, అడిషనల్ డీఆర్డీఓ రాజేశ్వరి, జిల్లా సంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి, జిల్లా మత్స్యశాఖ అధికారిణి డా.రజిని, డీఈఓ రమేశ్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్




అన్నపూర్ణాదేవి.. పాహిమాం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. - కందనూలు

ఆల్మట్టి.. ఆందోళన

పాలమూరు రైతాంగంలో గుబులు



కర్ణాటక రాష్ట్రంలో ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచేలా అక్కడి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండడం ఉమ్మడి పాలమూరులో అలజడి సృష్టిస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో జిల్లా ఎడారిగా మారే ప్రమాదం ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది ఎకరాలపై ప్రభావం పడనుండగా.. భూగర్భజలాలు ఇంకిపోయి తాగు నీటికీ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు, రైతుల్లో నెలకొన్న గుబులు.. పాలక, ప్రతిపక్ష నేతల పోరు కార్యాచరణపై 'సాక్షి' ఫోకస్..

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- సుమారు 20 లక్షల ఎకరాలపై ప్రభావం
- ఆల్మట్టి ఎత్తు పెంచితే సాగుతో పాటు తాగునీటికీ ఇబ్బందులే..
- పోరుకు సై అంటున్న బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు
- కర్ణాటక ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్
- అక్కడ మా పార్టీనే ఉన్నా.. మా ప్రజల హక్కులే ముఖ్యమని ఉద్ఘాటన
- భారీ సామర్థ్యంతో రిజర్వాయర్లు నిర్మించాలని మేధావుల సూచన

వేర్వేరుగా.. ఏకతాటిపై..

కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ఆల్మట్టి ఎత్తు పెంపు చర్యలను ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తున్నాయి. స్థానికంగా ఆయా పార్టీల నేతలు మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వ పన్నాగాన్ని తిప్పికొడతామని చెబుతున్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే పాలమూరుతో పాటు తెలంగాణ ఎడారిగా మారుతుందని.. ఇక్కడి ప్రజలు, రైతుల కోసం ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని.. ఢిల్లీలో సైతం పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కర్ణాటకలో తమ పార్టీనే అధికారంలో ఉన్నా.. తమకు ఇక్కడి ప్రజల హక్కులే ముఖ్యమని.. ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకుని తీరుతామని కాంగ్రెస్‌కు చెందిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు.

■ 'కర్ణాటకలో ఆల్మట్టి ఎత్తు పెంచడం వల్ల తెలంగాణ ప్రాంతం తీవ్రంగా నష్టపోతుంది. ముఖ్యంగా ఉమ్మడి పాలమూరు జిల్లాకు అన్యాయం జరుగుతుంది. ప్రస్తుతం కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాబట్టి ఇక్కడి కాంగ్రెస్ నేతలు వారితో సంప్రదింపులు జరిపి ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకోవాలి. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతాం.' అని బీజేపీకి చెందిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు.

ఏం జరుగుతోంది..

■ కృష్ణానదిపై కర్ణాటక రాష్ట్రంలో నిర్మించిన ఆల్మట్టి ప్రాజెక్ట్ ఎత్తు పెంపునకు వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఆందోళనలు జరిగాయి. దీనిపై సుప్రీంకోర్టులో వాదనలు నడుస్తున్నాయి. ఇదిలా ఉండగానే కర్ణాటక ప్రభుత్వం ఇటీవల 519.60 మీటర్ల నుంచి 524.26 మీటర్ల ఎత్తు పెంచేలా ముందుకు సాగుతోంది. ఈ మేరకు రూ.30 వేల కోట్ల అంచనా వ్యయంతో అదనంగా 130 టీఎంసీల నీటిని వినియోగించుకునే కార్యాచరణతో ప్రయత్నాలు ప్రారంభించింది. భూసేకరణలో భాగంగా నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు రూ.70 వేల కోట్ల మంజూరుకు కర్ణాటక ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమాచారం.

వర్షాభావ, విపత్కర పరిస్థితుల్లో..

ఆల్మట్టి ఎత్తు పెంచిన పక్షంలో తెలంగాణతోపాటు ఏపీ రాష్ట్రానికి భారీ నష్టం వాటిల్లుతుంది. తెలంగాణలో ప్రధానంగా కృష్ణా పరివాహకంలోని ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలు ఎడారిగా మారే ప్రమాదం ఉంది. వర్షాభావ, విపత్కర పరిస్థితుల్లో ఆల్మట్టి గేట్లు తెరవకుంటే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలతోపాటు నెట్టెంపాడు, భీమా–1, 2, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, కోయిల్ సాగర్ ప్రాజెక్ట్‌కు కృష్ణా నీరు చేరని పరిస్థితి ఉంటుంది. ఫలితంగా వీటి పరిధిలో సుమారు 20 లక్షల ఎకరాల సాగుపై సందిగ్ధత నెలకొనే అవకాశం ఉంటుందని.. తాగునీటికీ కటకట ఏర్పడుతుందని రైతు సంఘాల నేతలు చెబుతున్నారు. ■

100 టీఎంసీల చొప్పున 3 చోట్ల రిజర్వాయర్లు నిర్మించాలి..

ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురిసినప్పుడు సుమారు 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. ఆల్మట్టి ఎత్తు పెంచితే అక్కడ అదనంగా మరో 100 టీఎంసీల నీళ్లు నింపుకుంటారు. మిగిలిన 2,900 టీఎంసీల నీళ్లయితే మనకు వస్తాయి కదా. ఇక్కడ ఎత్తు తగ్గించడం అనే డిమాండ్ కంటే.. పాలమూరు జిల్లాలో భారీ నీటి నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలి. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా మిగతావన్నీ ఎత్తిపోతలే. జూరాల కూడా అంతంతమాత్రమే. ఇప్పటికైనా భీమా, కృష్ణా నదులు కలిసే ప్రాంతంలో, జూరాలకు కుడివైపున ర్యాలంపాడ్‌తో పాటు ఆర్డీఎస్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి అక్కడ, కేఎల్ఐ వద్ద, లక్ష్మీదేవిపల్లి వద్ద.. ఈ మూడు చోట్ల 100 టీఎంసీల చొప్పున నీరు నిల్వ చేసేలా భారీస్థాయిలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించాలి. అప్పుడే ఉమ్మడి జిల్లాలో సాగు, తాగు నీటికి ఇబ్బందులు తొలుగుతాయి.



– రాఘవాచారి, ఉమ్మడి జిల్లా కన్వీనర్, పాలమూరు అధ్యయన వేదిక

న్యూస్‌రీల్

ఆర్టీసీ ప్రయాణికులకు దసరా కానుక

కొల్లాపూర్: దసరా పర్వదినం సందర్భంగా ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు ఆర్టీసీ డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే వారికి నగదు బహుమతులు అందించనున్నట్లు కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు తమ టికెట్లపై పేరు, చిరునామా, ఫోన్ నంబర్ రాసి.. బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు. అక్టోబర్ 7న ఆర్టీసీ రీజనల్ కార్యాలయంలో లక్కీ డ్రా తీసి.. 8న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైనదని.. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డా.రవికుమార్ అన్నారు. ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం పాత కలెక్టరేట్ భవనంలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఔషధాల సరఫరా, సమయానికి సరైన మందులు అందించడం, ప్రజలకు ఔషధ వినియోగంపై అవగాహన కల్పించడం ద్వారా ఫార్మసిస్టులు సమాజ ఆరోగ్య భద్రతలో కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ కుమార్, సెక్రటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్, కుమారాచారి, భగత్, రాజశేఖర్, దిలీప్, శ్రీకాంత్, సంపత్, రఘు కుమార్, చంద్రమౌళి, సురేశ్, రవీందర్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

29న కొండారెడ్డిపల్లిలో మంత్రుల పర్యటన

వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కొండారెడ్డిపల్లిలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొండారెడ్డిపల్లిలో పూర్తిచేసిన అభివృద్ధి పనులతో పాటు కొత్త పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ఈ నెల 29న రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డా.వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఇటీవల రూ.91.71 కోట్లు మంజూరు కాగా.. రూ. 55కోట్లతో కొండారెడ్డిపల్లి నుంచి డిండి చింతపల్లి వరకు ఫోర్‌లైన్స్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మిగతా నిధులతో పోస్టాఫీస్, పాలసేకరణ కేంద్రం, పాఠశాల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో కొండారెడ్డిపల్లి గ్రామాభివృద్ధి అధికారి దేవసహాయం ఉన్నారు.

కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం



కొండనాగులలో గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల/చారకొండ/బల్మూర్: పేద విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి, ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. గురువారం లింగాల శివారులో రూ. 3కోట్లతో గిరిజన బాలుర వసతిగృహం నిర్మాణ పనులను ప్రారంభించారు. చారకొండ మండలం సిర్సనగండ్ల, బల్మూర్ మండలం కొండనాగుల, లింగాల మండలం అంబట్‌పల్లి గ్రామాల్లో మినీ గ్రంథాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లింగాలలో ఇప్పటికే రూ. 2.30కోట్లతో ఇంటిగ్రేటెడ్ వసతిగృహం నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు. గ్రామాల్లో డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుతో కామన్ ఎంట్రిన్స్ టెస్టులతో పాటు అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. సిర్సనగండ్ల దేవాలయ భూమిలో అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్లు కోల్పోయిన 35 మందికి త్వరలోనే సర్వే నంబర్ 290లో ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఎంపీ, ఎమ్మెల్యే దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, డీటీడీఓ ఫిరంగి, ఆర్డీఓ మాధవి, ఆలయ చైర్మన్ రాహశర్మ, ఈఓ ఆంజనేయులు, నాయకులు రంగినేని శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రావు, వెంకట్‌గౌడ్, బాల్‌రాంగౌడ్, నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కాశన్నయాదవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల కదలికలపై నిఘా : ఎస్పీ

అచ్చంపేట రూరల్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి భరోసా కల్పించడంతో పాటు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశించారు. గురువారం అచ్చంపేట డీఎస్పీ, సీఐ కార్యాలయాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. నేరాల అదుపునకు గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. కేసుల నమోదు, రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. డయల్ 100 కాల్స్‌కి వెంటనే స్పందించి.. ఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు. శ్రీశైలం–హైదరాబాద్ హైవేలో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విలేజ్ పోలీసింగ్ ఆఫీసర్లు తమ గ్రామాలను తరచూ సందర్శించాలని సూచించారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ వెంట డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్ఐలు విజయభాస్కర్, ఇందిర, పవన్‌కుమార్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.



అచ్చంపేట డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ఇక టెండర్ల జాతర

కొత్త మద్యం పాలసీకి దుకాణాల కేటాయింపు

- నేటినుంచి వచ్చేనెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 227 దుకాణాలకు టెండర్ల ఆహ్వానం



మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి మద్యం దుకాణాల కేటాయింపు చేసింది. ఈ ఏడాది నవంబర్ 30తో ప్రస్తుత ఎక్సైజ్ మద్యం పాలసీ ముగియనున్న క్రమంలో డిసెంబర్ 1నుంచి కొత్త మద్యం దుకాణాలు అమల్లోకి రానున్నాయి. కొత్త మద్యం దుకాణాలకు సంబంధించి కులాల వారీగా దుకాణాల కేటాయించనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 230 మద్యం దుకాణాలు కొనసాగుతుండే ఈసారి అలంపూర్, రాజోళి, చెన్నారం దగ్గర ఉన్న మద్యం దుకాణాలు తొలగించి.. ఈసారి 227 దుకాణాలకు టెండర్లు స్వీకరించనున్నారు. మూడు దుకాణాల్లో సరైన మద్యం అమ్మకాలు లేకపోవడంతో వాటిని రద్దు చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఉన్న టెండర్ ఫీజు రూ.2 లక్షల నుంచి ఈసారి రూ.3 లక్షలకు పెంచారు. ఒక్కో వ్యాపారి ఎన్ని మద్యం దుకాణాలకు అయినా టెండర్ వేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆయా జిల్లాకేంద్రాల్లో ఉండే కలెక్టర్ కార్యాలయాల్లో ఉదయం నుంచి 10 గంటల నుంచి సాయంత్రం వరకు టెండర్లు స్వీకరించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. 2021లో మొత్తం 230 దుకాణాలకు 4,713 టెండర్లు వస్తే 2023లో 230 దుకాణాలకు 8,595 టెండర్లు వచ్చాయి. ఈ సారి పదివేలకు పైగా టెండర్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

⇨ వచ్చే నవంబర్ 30తో ప్రస్తుత మద్యం దుకాణాల గడువు ముగిస్తున్న నేపథ్యంలో కొత్త దుకాణాల లైసెన్స్ కోసం ప్రభుత్వం టెండర్ల స్వీకరణకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 1 నుంచి మళ్లీ కొత్త దుకాణాలు ప్రారంభం కానుంది. ఈ నెల 26 నుంచి (శుక్రవారం) నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబర్ 23న లక్కీ డ్రా నిర్వహించి దుకాణాలను కేటాయించనున్నారు. ఒక్కో దుకాణానికి టెండర్ ఫీజు రూ.3 లక్షలు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలు నాలుగు స్లాబ్‌ల కిందట ఉన్నాయి. రూ.50 లక్షలు, రూ.55 లక్షలు, రూ.60 లక్షలు, రూ.65 లక్షల కింద దుకాణాలు ఉన్నాయి.

ఏర్పాట్లు చేస్తున్నాం..

నాగర్‌కర్నూల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. మద్యం వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తున్నాం. ఒక్కో దుకాణానికి ప్రభుత్వం నిర్ణయించిన రూ. 3లక్షల ఫీజును బ్యాంకు డ్రాఫ్ట్, చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. గౌడ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వు అయిన షాపులకు దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత అధికారుల నుంచి కుల ధ్రువపత్రం, షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న షాపులకు దరఖాస్తు చేసుకునే వారు స్థానిక షెడ్యూల్డ్ ట్రైబ్ సర్టిఫికెట్ సమర్పించాలి. జిల్లాలోని 67 మద్యం దుకాణాలను అక్టోబర్ 23న లాటరీ పద్ధతిన కేటాయిస్తాం.

– గాయత్రి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఉమ్మడి జిల్లాలో గత మూడుసార్లు జరిగిన టెండర్ ప్రక్రియలో వచ్చిన దరఖాస్తుల వివరాలు

జిల్లా	2019	2021	2023
మహబూబ్‌నగర్/ నారాయణపేట	1,384	1,525	3,571
నాగర్‌కర్నూల్	1,064	1,507	2,524
జోగుళాంబ గద్వాల	418	987	1,171
వనపర్తి	516	694	1,329

దుకాణాల కేటాయింపు ఇలా..

జిల్లా	గౌడ్	ఎస్సీ	ఎస్టీ	ఓపెన్	మొత్తం
మహబూబ్‌నగర్/ నారాయణపేట	14	10	3	63	90
నాగర్‌కర్నూల్	9	9	4	45	67
జోగుళాంబ గద్వాల	5	6	0	23	34
వనపర్తి	4	5	1	26	36

కళాశాలల అభివృద్ధికి బాటలు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు

- నేడు జిల్లావ్యాప్తంగా సమావేశాలు
- కళాశాల నిర్వహణ, నిధులపై చర్చ
- మొదటిసారిగా తల్లిదండ్రుల భాగస్వామ్యం

కందనూలు: ప్రైవేటుకు ధీటుగా సర్కారు జూనియర్ కళాశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమైన ఉపాధ్యాయ, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు ఇక జూనియర్ కళాశాలల్లోనూ నిర్వహించనున్నారు. శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సమావేశాల్లోనే అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

ముఖ్యమంత్రి పేరిట ఆహ్వానాలు..

రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పేరిట ఇంటర్ బోర్డు రూపొందించిన ఆహ్వాన పత్రాలను పంపించారు. ''మీ పిల్లల విజ్ఞాన అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న సమావేశాల్లో తల్లిదండ్రులు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని కోరుతున్నాం''.. అంటూ ఆహ్వాన పత్రంలో ముఖ్యమంత్రి సందేశం ముద్రించి ఉంది. వీటిని అధ్యాపకులు విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు చేరవేశారు.

జిల్లాకు రూ.1.22 కోట్లు కేటాయింపు..

పదేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు రాక పోవడంతో నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. సరైన వసతులు లేక అధ్యాపకులు, విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. కళాశాలల నిర్వహణ కోసం గత నెలలో ప్రభుత్వం ప్రతి కళాశాలకు రూ. 9లక్షల వరకు నిధులు కేటాయించింది. వాటిని ఏ విధంగా ఖర్చు చేయాలనే అంశాలతో పాటు విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

హాజరుశాతం మెరుగు..

కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు ఈ సమావేశాలు ఎంతగానో దోహదపడనున్నాయి. అదే విధంగా క్రమశిక్షణ, విద్యాభివృద్ధి, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు, సైన్స్ ల్యాబ్‌ల నిర్వహణ, విద్యుద్దీకరణ, గ్రీన్‌బోర్డులు, తాగునీటి వసతి, భవనాల ఫ్లోరింగ్ తదితర వసతులపై చర్చించనున్నారు. ఆయా అంశాలపై కమిటీ చైర్‌పర్సన్, కన్వీనర్ అయిన ప్రిన్సిపాల్‌తో చర్చించి.. కమిటీ తీర్మానం మేరకు నిధులు ఖర్చు చేయనున్నారు.




ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మాక్ మీటింగ్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ రాణి (ఫైల్)

విద్యార్థుల సంఖ్య ఇలా..

జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. ప్రథమ సంవత్సరం 2,290 మంది అభ్యసిస్తున్నారు. అందులో జనరల్ విద్యార్థులు 1,639 మంది, ఒకేషనల్ విద్యార్థులు 651 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో 1,763 మంది విద్యార్థులు ఉండగా.. జనరల్ విద్యార్థులు 1,247, ఒకేషనల్ 516 మంది ఉన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశాలు విద్యాప్రమాణాల పెంపునకు దోహదం చేస్తాయి. సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం. – వెంకటరమణ, డీఐఈఓ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఊర్కొండ: మండల పరిధిలోని ముచ్చర్ల పల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రచాలపల్లి కళ్యాతండాకి చెందిన పాట్లవత్ శ్రీనివాస్ (46) బుధవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఓ డీసీఎం డ్రైవర్ రోడ్డుపై పడి ఉన్న మృతదేహాన్ని చూసి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ కృష్ణదేవ సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- ఆగి ఉన్న డీసీఎం ఢీకొట్టిన బైక్



అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మస్తాన్ వ లి(28) అనే వ్యక్తి మృతి చెందాడు. ఉండవెల్లి ఎస్ఐ శేఖర్ తెలిపి న వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన మస్తాన్‌వలి అతని భార్య వహీదా బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టారు. ప్రమాదంలో మస్తాన్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వహీదాకు గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి గుంటలో పడి మహిళ మృతి

లింగాల: మండల కేంద్రానికి చెందిన తోళ్ల తిరుపతమ్మ (43) అనే వివాహిత ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుపతమ్మ పశువులకు నీళ్లు పెట్టడానికి బిందెతో నీటిని తెచ్చేందుకు నీటి గుంట దగ్గరకు వెళ్లింది. ఈ క్రమంలో కాలు జారి కుంటలో పడిపోయింది. ఈత రాకపోవడంతో నీట మునిగి చనిపోయింది. మృతురాలికి భర్త బాలస్వామితో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు. మృతురాలి కుమారుడు సాయిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు.

ఆటోలో నుంచి కిందపడి వ్యక్తి మృతి

గోపాల్‌పేట: ప్రయాణిస్తున్న ఆటోలో నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన జయన్న తిర్మలాపూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జయన్న తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కావలి లక్ష్మయ్య (40) జయన్న తిర్మలాపూర్ నుంచి వనపర్తి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. ఆటో డ్రైవర్ మనోహర్ రెడ్డి మున్ననూరు గ్రామంలో మలుపువద్ద వేగంగా తిప్పడంతో కావలి లక్ష్మయ్య ఆటోలో నుంచి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అదే ఆటోలో వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మరణించాడు. లక్ష్మయ్య భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ వెల్లడించారు.

మూడు కిరాణం షాపుల్లో చోరీ

దేవరకద్ర: మున్సిపాలిటీ కేంద్రంలోని రాయిచూర్ రోడ్‌లో ఉన్న మూడు కిరాణ షాపుల్లో చోరీ జరిగిన ఘటన గురువారం ఉదయం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం .. వీరప్పయ్యస్వామి షాపింగ్ కాంప్లెక్స్‌లోని మైలాపురం రమేశ్, గూరకొండ శ్రీను, కొకుంట్ల నాగయ్య కిరాణం షాపులకు బుధవారం రాత్రి తాళాలు వేసి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూడగా షెటర్ తాళాలు పగులగొట్టి, తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, రూ. 84 వేల విలువైన సిగరెట్లు, నగదును దోచుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు.

ఒక్కో మెట్టెక్కి.. విజయతీరాలకు

- గ్రూప్–1 ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వాసుల సత్తా
- డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, మరెన్నో ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక



కడు పేదరికం కుటుంబాన్ని వెంటాడుతున్నా విద్యనే ఆయుధంగా చేసుకున్నారు కొందరు. తల్లిదండ్రుల కల నెరవేర్చాలనే తపనతో రేయింబవళ్లు కష్టపడి చదువుతూ ముందుకు సాగారు మరికొందరు. ఇలా.. ఒక్కో మెట్టు ఎక్కుతూ గ్రూప్స్‌లో సత్తా చాటారు ఉమ్మడి జిల్లావాసులు. ఎలాంటి ఆధారంలేని నిరుపేదలు సైతం క్రమశిక్షణతో.. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని నిరూపిస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు గ్రూప్–1 అభ్యర్థులు. పూర్తి వివరాలిలా..

–సాక్షి నెట్‌వర్క్

ఏళ్ల నాటి నిరీక్షణ ఫలించింది



ఎన్నో ఏళ్లుగా గ్రూప్–1 లో సత్తా చాటాలనే లక్ష్యంగా కష్టపడి చదివాను. గతంలోనే రెండు సార్లు ఎంపిక కాగా ఒక సారి ప్రభుత్వం రద్దు చేసింది. మరో సారి సాంకేతిక కారణాలతో ఎంపిక కాలేకపోయా. తాజాగా ప్రభుత్వం పో స్టులు పెంచి నోటిఫికేషన్ వేయడంతో మరో సారి పుస్తకాలతో కుస్తీపడ్డా. ఎట్టకేలకు 224 ర్యాంక్ సాధించాను. మాది వ్యవసాయ కుటుంబం. మా తల్లిదండ్రులు యాదమ్మ, మల్లికార్జున్‌కు చదువు రాకపోయినా నా చదువు కోసం ఎంతో శ్రమపడ్డారు. సహకరించారు.

– వస్పరి ప్రశాంతి, తాదూరు గ్రామం

అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా కిష్టాపూర్ యువకుడు



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మురళి యాదవ్ గ్రూ ప్–1 ఫలితాల్లో 290 ర్యాంకు సాధించి అసిస్టెంట్ ట్రెజరీ ఉద్యోగం సాధించాడు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచు శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు మురళియాదవ్ బీటెక్ అనంతరం హైద్రాబాద్‌లో సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యాడు. ఎట్టకేలకు గ్రూప్ –1 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకుతో ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎలాంటి కోచింగ్ లేకుండానే ఏటీఓగా..



కొత్తపల్లి: ఎలాంటి కోచింగ్ లేకుండా తాత గారి పర్యవేక్షణలో కష్టపడి చది విన నందిని గ్రూప్–1లో సత్తా చాటి ఏటీఓ పోస్టుకు ఎంపికైంది కొత్తపల్లికి చెందిన కలాల్ నందిని. ఈమె బీఎస్సీ బీఈడి చేసింది. ప్రస్తుతం కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. తాజాగా విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో ఉన్నత ఉద్యోగం సంపాదించింది. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కష్టపడి చదివి.. డీఎస్పీగా ఎంపిక



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని శానాయిపల్లి గ్రామానికి చెందిన మండ్ల కవిత గ్రూప్–1 ఫలితాల్లో పదో ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. శానాయిపల్లికి చెందిన నాగయ్య, పార్వతమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు కూతుళ్లలో రెండో కూతురైన కవిత బీటెక్ బాసర ట్రిపుల్ ఐటీలో పూర్తి చేశారు. రెండేళ్ల క్రితం టీజీ ఎస్పీడీసీఎస్‌లో ఏఈగా ఉద్యోగం సంపాదించారు. ఏడాది పనిచేసిన అనంతరం గ్రూప్–1 కోసం ఇంటివద్ద ఉండి ప్రిపేర్ అయ్యారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ర్యాంకుతో డీఎస్పీగా ఎంపికయ్యారు.

అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండ్‌గా పోతారెడ్డిపల్లి వాసి



వంగూరు: వంగూరు మండలం పోతారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వావిలాల చిరంజీవి గ్రూప్–1 ఫలితాల్లో 169వ ర్యాంక్ సాధించి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టు దక్కించుకున్నారు. అయితే, చిరంజీవి 2013లోనే ఉద్యోగం సాధించి ఆర్అండ్‌బీ ఈఈగా పనిచేసి ప్రస్తుతం ఆర్అండ్‌బీ డీఈఈగా మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్నారు. తాజాగా గ్రూప్–1 లో ఉద్యోగం సాధించడంతో కుటుంబసభ్యుల తోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసారు.

డీఎస్పీ స్థాయికి..



పాన్‌గల్: వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుజాత గ్రూఫ్ –1లో రాష్ట్ర స్థాయిలో 405వ ర్యాంక్, మల్టీ జోన్–2లో 225వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సుజాత చిన్న వయస్సులో తండ్రి మరణించడంతో తల్లి కళావతమ్మ పర్యవేక్షణలో చదువు కొనసాగించారు. 2018వ సంవత్సరంలో కానిస్టేబుల్‌గా ఎంపికై ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమై 2020వ సంవత్సరంలో ఎస్ఐ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గ్రూఫ్–1 ఫలితాల్లో డీఎస్పీ పోస్టుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

తొలి ప్రయత్నంలోనే డీఎస్పీకి ఎంపికైన సౌమ్య

జడ్చర్ల టౌన్: గ్రూప్ –1 ఫలితాలలో మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన డి.సౌమ్య డీఎస్పీ పోస్టుకి ఎంపికైంది. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు దాసరి గిరివర్ధన్ సులోచన రాణి కూతురు సౌమ్య ఐఏఎస్ లక్ష్యంగా ముందుకు సాగింది. సౌమ్య ప్రాథమిక, హైస్కూల్ విద్య మహబూబ్‌నగర్‌లో సాగగా ఇంటర్, ట్రిపుల్‌ఐటి హైదరాబాద్‌లో చేసింది. మూడేళ్లుగా యూపీఎస్‌సీ ద్వారా ఐఏఎస్ లక్ష్యంగా చదువుతుంది. ఈ క్రమంలో గ్రూప్ –1 పరీక్షకు హాజరైంది. తొలిసారే 256 మార్కులు సాధించి డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యింది. త్వరలోనే శిక్షణకు హాజరు కావాల్సి ఉంది. సౌమ్య గ్రూప్– 1లో డీఎస్పి పోస్టుకు ఎంపిక కావటం పట్ల లింగంపేట గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.

ప్రణాళికతో చదివా..



రాష్ట్రంలో తొలి గ్రూప్ –1లో డీఎస్పీ పోస్టుకు ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉంది. అయితే యూపీఎస్సీ ద్వారా ఐఏఎస్ కావాలని లక్ష్యంగా నిర్దేశించుకొని చదివా. తల్లిదండ్రులు గిరివర్ధన్, సులోచనరాణి ప్రోత్సాహంతోపాటు ఐఏఎల్ అనుదీప్‌దురిశెట్టి స్ఫూర్తిగా ఐఏఎస్ సాధించాలని మూడేళ్లుగా కృషిచేస్తున్నా. విధుల్లో చేరిన తరువాత ఐఏఎస్ లక్ష్యంగా ముందుకు సాగుతాను. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

– డి.సౌమ్య, లింగంపేట, జడ్చర్ల

తల్లిదండ్రుల కలను నిజంచేస్తూ.. డిప్యూటీ కలెక్టర్‌గా



నారాయణపేట రూరల్: గిరిజన సామాజిక వర్గంలోని ఓ సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఓ యువతి గ్రూప్ –1 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యింది. తల్లి వసుంధర గృహిణికాగా.. తండ్రి శ్రీనివాస్ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరి ముగ్గురు పిల్లల్లో వీణ ఒకరు. ఓయూలో ఎంఏ పూర్తి చేయగా.. చిన్నతనం నుంచి ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ముందుకుసాగింది. రెండేళ్ల శిక్షణ అనంతరం గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 118వ ర్యాంకు, మల్టీ జోన్–2లో 47వ ర్యాంకుతో ఆమె డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైంది. గతేడాది 2024లో గురుకుల డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా, 2025లో టీఎస్‌పీఎస్సీలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యింది. ప్రస్తుతం గోల్కొండలోని బీజేఆర్ మహిళా కళాశాలలో లెక్షరర్‌గా పనిచేస్తుంది. ఈసందర్భంగా వీణ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పాటు వెనకబడిన కు లాల వారు, నిరుపేద కు టుంబాలకు చెందిన వారు సైతం ఉన్నత స్థాయికి చేరు కోవచ్చని నిరూపించాలనే ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల కలను నిజం చేయడానికి మెంటర్ మురళిని ఆదర్శంగా తీసుకుని చదువుకున్నట్లు తెలిపారు.



పట్టుదలతో ముందుకుసాగి..!

శాంతినగర్: పుట్టిన ఏడాదికే తండ్రిని కోల్పోయాడు. అమ్మమ్మ వాళ్లు చేరదీయడంతో వారి ఇంట్లోనే ఉంటూ ఇంటర్ వరకు పూర్తి చేశాడు. ఓ వైపు క్షౌ రవృత్తి చేసుకుంటూనే.. కానిస్టేబుల్ ఉద్యోగం, ఆ తర్వాత ఓపెన్ డిగ్రీ పూర్తి చేసి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనే ఉన్నత ఉద్యోగం వైపు అడుగులు వేశాడు. కొద్ది మార్కుల తేడాతో ఎంపీడీఓ పోస్టు కొట్టాడు మల్దకల్ మండలం ఎల్కూరుకు చెందిన ఎం.పరశురాముడు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్కూరుకు చెందిన మంగళి రంగయ్య, మహేశ్వరి దంపతులకు పరుశరాముడు పుట్టిన ఏడాదికాలంలోనే తండ్రి మృతిచెందాడు. అమ్మమ్మ నర్సమ్మ ఇంటికి తల్లితోపాటు చేరుకొని అక్కడే ఇంటర్ వరకు పూర్తి చేశాడు. ఇళ్లు గడవని పరిస్థితిలో సెలూన్ షాపులో పనిచేశాడు. ఎలాగైనా తల్లి పడుతున్న కష్టాల గట్టెక్కించాలని లక్ష్యం పెట్టుకున్నాడు. 2018లో నిరంతరం కృషి చేసి కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించాడు. అటు ఉద్యోగం చేస్తూనే ఓపెన్ డిగ్రీ పాసయ్యాడు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నత ఉద్యోగం (డీఎస్పీ పోస్టు) సాధించాలని పట్టుదలతో అటు భార్య రజిత ప్రోత్సాహం, గురువు డీఎస్పీ రామచంద్రుడు విలువైన సూచనలతో ముందుకుసాగాడు. ఎట్టకేలకు గ్రూప్–1 లో 858 మార్కులతో ఎంపీడీఓ పోస్టు కొట్టాడు.

డీఎస్పీ కావాలనుకున్నా



డీఎస్పీ కావాలనేది నా కోరిక. ఆ కోరికే నన్ను గ్రూప్–1 పరీక్ష రాయడానికి ప్రేరేపించింది. కు టుంబ ఆర్థిక పరిస్థితి బా గాలేకున్నా ఇద్దరు పిల్లలతో సతమతమవుతూనే నా భార్య అన్ని విధాలా అండగా నిలిచింది. దీంతో అటు పోలీస్ కానిస్టేబుల్‌గా అలంపూర్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తూనే గ్రూప్–1కు ప్రిపేర్ అయి పరీక్ష రాశాను. బుధవారం అర్ధరాత్రి వెలువడిన ఫలితాల్లో 858 ర్యాంకు సాధించాను. పది మార్కులు వచ్చి వుంటే నేను డీఎస్పీ అయ్యేవాడిని. లక్ష్యం నెరవేరేది. డీఎస్పీ కావడానికి మరోసారి ప్రయత్నం చేస్తాను.

– పరశురాముడు, పైపాడు, వడ్డేపల్లి మున్సిపాలిటీ

చరిత్ర వక్రీకరణను కలంతో అడ్డుకుందాం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట గాథల్ని వివిధ కార్యక్రమాల ద్వారా జనం ముందుకు తీసుకెళుదామని విజ్ఞాన దర్శిని రాష్ట్ర వ్యవస్థాపకులు టి.రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జలజం జూనియర్ కళాశాలలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై తెలంగాణ సాహితి, టీపీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచ ప్రసిద్ధ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర వక్రీకరణను కలంతో అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వీర తెలంగాణ పోరాటంపై ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. తర్వాత జరిగిన కవి సమ్మేళనంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కవులు కవితా గానం చేశారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులందరికీ నిర్వాహకులు శాలువా, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షుడు ఖాజా మైనుద్దీన్, ప్రధాన కార్యదర్శి కొప్పోలు యాదయ్య, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం జిల్లా కన్వీనర్ కురుమూర్తి, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

అట్టహాసంగా..!

రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



మహబూబ్‌నగర్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే యెన్నం తదితరులు



టోర్నీలో పాల్గొన్న వివిధ జిల్లాల జట్లు

- పాల్గొన్న వివిధ జిల్లాల జట్లు
- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 12 క్రీడా జట్లు పాల్గొన్నాయి. ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ఆడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్టేడియం అభివృద్ధి కోసం రూ.16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని అన్నారు. క్రీడలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఫాల్గున మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో నిరంతరం ప్రాక్టిస్ చేయాలని, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీలు జరుగుతుండడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా జట్టు గతంలో పలుసార్లు ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచినట్లు గుర్తుచేశారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహిస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్పీ వెంకటేశ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, సభ్యులు రమేష్, శంకర్‌లింగం, గజానంద్‌కుమార్, రామేశ్వర్, నందకిషోర్, నాగేశ్వర్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు బాల్‌రాజు, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ శుభారంభం..

రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య మహబూబ్‌నగర్ జిల్లా జట్టు శుభారంభం చేసింది. మహబూబ్‌నగర్ జట్టు 2–0 గోల్స్ తేడాతో ఖమ్మం జట్టుపై విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు తరఫున కళ్యాణ్ రెండు గోల్స్ చేశాడు. ఇతర మ్యాచుల్లో ఆదిలాబాద్ జట్టు 2–0 గోల్స్ తేడాతో నిజామాబాద్ జట్టుపై, కరీంనగర్ 4–1 తేడాతో ఖమ్మం జట్టుపై, రంగారెడ్డి జట్టు 6–0 తేడాతో నల్గొండ జట్టుపై, మెదక్ జట్టు 7–0 గోల్స్ తేడాతో వరంగల్ జట్టుపై గెలుపొందగా వనపర్తి జట్టు– నిజామాబాద్ జట్లు చెరో గోల్స్ చేయడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్షలు

జడ్చర్ల: మండల పరిధిలోని పోలేపల్లి సెజ్‌లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులు గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సెజ్ నిర్వాసితులకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలను క్రయవిక్రయాలు చేసేందుకు తమకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సెజ్‌లో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్న పరిశ్రమల వ్యర్థాలకు సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాసితులకు కేటాయించిన ఇంటి స్థలాలను కొందరు దళారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరహార దీక్షలు చేస్తున్న నిర్వాసితులు

జూరాలకు నిలకడగా వరద



జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద

ధరూరు/ఆత్మకూర్/రాజోళి: జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద నిలకడగా ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 2.55 లక్షల క్యూసెక్కులు ఉండగా.. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో 2,55,850 క్యూసెక్కులు ఉందన్నారు. దీంతో ప్రాజెక్టు 32 క్రస్ట్ గేట్లను పైకెత్తి 2,22,624 క్యూసెక్కుల వరద దిగువకు వదిలినట్లు చెప్పారు. విద్యుదుత్పత్తికి 27,927 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 68, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 570, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.531 టీఎంసీలు ఉందన్నారు.

ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి..

జూరాల ఎగువ జల విద్యుత్ కేంద్రంలోని ఆరు యూనిట్లలో మాత్రమే గురువారం ఉత్పత్తి కొనసాగినట్లు ఎస్ఈ శ్రీధర్ వివరించారు. 234 మెగావాట్లు, 364.602 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని.. ఇప్పటి వరకు 735.464 మి.యూ. పూర్తి చేసినట్లు వివరించారు. జలాశయానికి వరద అధికంగా చేరుతుండటంతో దిగువ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టడం లేదని చెప్పారు.

సుంకేసులకు సైతం..

సుంకేసుల జలాశయానికి గురువారం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో నిలకడగా ఉన్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 25,350 క్యూసెక్కులు వరద రాగా.. 5 గేట్లను మీటర్ మేర తెరిచి 22,395 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు వివరించారు. కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.